




ప్రజా ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి


కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించే విషయంలో కొన్ని శాఖలు వెనకంజ లో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ. ఆనంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మోహన్ రావు, డిపిఓ శ్రీధర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే, ఎడ్యుకేషన్, పోలీస్, గనుల శాఖ, డిజేబుల్ వెల్ఫేర్, దేవాదాయ శాఖ వంటి శాఖలు ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వెనుకబడి ఉన్నాయని బియాండ్ ఎస్.ఎల్.ఏ పోకుండా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా ప్రతి శాఖ కూడా ప్రజా ఫిర్యాదులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల విషయంలో ఆడిట్ నిర్వహించుకోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 249 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

పారిశుధ్య పనులు కాంట్రాక్టర్లకు అప్పగించడం దుర్మార్గం


బలవంతంగా కార్మికులను తోస్తున్న పోలీసులు

-కలెక్టరేట్ వద్ద పోలీసులకు, కార్మికుల మధ్య ఉద్రిక్తత
-నలుగురు పారిశుధ్య మహిళా కార్మికులకు తీవ్రగాయాలు


ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం బలహీనవర్గాలు పేద కార్మికులైన పారిశుధ్య కార్మికుల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలను పాల్పడడం విచారకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మోహన్ రావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్మికులు సమ్మె పోరాటంలో భాగంగా గాంధీ బొమ్మ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు మున్సిపల్ కార్మికులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 9 రోజులు నుండి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం పట్ల మున్సిపల్ కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న కార్మికులు కలెక్టర్ వచ్చి తమ అర్జీని స్వీకరించి,సమస్యల పరిష్కరించాలని కోరిన మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు నుండి ఏ సమాధానం రాకపోవడంతో కలెక్టర్ వద్దకు మమ్మల్ని అందరినీ అనుమతించాలని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కలెక్టర్ ఆఫీసులోకి వెళ్లేందుకు మున్సిపల్ కార్మికులు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని గేట్లు వేశారు. కొంతసేపు తోపులాట ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో అనేకమంది మహిళా కార్మికులకు గాయాలయ్యాయి. నలుగురు మహిళా కార్మికులకు రక్త గాయాలయ్యాయి. ఇద్దరు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. తోటి కార్మికులు వెంటనే వారిని ఆసుపత్రులకు తరలించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో,కార్మికులతో పోలీసులు చర్చ జరిపి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం యూనియన్ నాయకులు కలెక్టర్ ఓ. ఆనంద్ కు సమస్యలతో కూడిన అర్జీని సమర్పించి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఎం. మోహన్ రావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు,జిల్లా కార్యదర్శి కే. పెంచల నరసయ్యలు మాట్లాడారు. పారిశుధ్యపనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఆహ్వానించిన టెండర్లను రద్దు చేయాలని, ఈ వ్యవహారంపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో కార్మికులు చేస్తున్న సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రకటించారు. గతంలో 279 జీఓ పేరుతో కార్మికుల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ప్రయత్నించగా కార్మికులు సంఘటితంగా పెద్ద ఎత్తున పోరాడి వాటిని వెనక్కి తిప్పి కొట్టారని అన్నారు. ఆ పోరాటం ఫలితంగానే నారాయణ గతంలో ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. మరలా రాష్ట్రంలో ఎక్కడా లేని మొట్టమొదటిగా నెల్లూరు నుండే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే చర్యలకు మంత్రి పూనుకున్నారన్నారు. తక్షణమే పిలిచిన టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా నిర్లక్ష్యంగా పనిలో ఆపివేయడం తగదని అన్నారు. చాలీచాలని జీతాలు తీసుకుంటున్న మున్సిపల్ కార్మికులకు అన్యాయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేశారని తక్షణమే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ విభాగం కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో


స్పృహ కోల్పోయిన కార్మికురాలు

సిఐటియు నెల్లూరు నగర నాయకుల పి. సూర్యనారాయణ, రూరల్ నాయకులు సుధాకర్, నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సిఎం వి.ఎస్ అచ్యుతానందన్ మృతి

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రముఖ సిపిఎం నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ (102) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు.ఆయన మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఒక ప్రకటనను పత్రికలకు విడుదల చేశారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో తిరువనంతపురంలోని ఎస్.యు.టి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా, మూడుసార్లు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2006 - 2011 మధ్యకాలంలో ఆయన కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారు. 1980 నుండి 1991 వరకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన సిపిఎం రాష్ట్ర కమిటీకి రెగ్యులర్ ఆహ్వానితులుగా ఉన్నారు.

విజయదశమికి లబ్ధిదారులకు గృహాలు

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసి, విజయదశమి నాటికి బి, సి కేటగిరీల డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించనున్నామని కమిషనర్ వై.ఓ నందన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. పలు కారణాలతో లబ్ధిదారులకు కొన్ని గృహాలు మంజూరు కాలేదని, వాటికోసం గతంలో చెల్లించిన మొత్తాలను తిరిగి అందిస్తామని కమిషనర్ అన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ లో మున్సిపల్ కమిషనర్ కె అనూష ఆధ్వర్యం లో సచివాలయ శానిటేషన్ సిబ్బంది స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు , తడి, పొడి చెత్త ల విభజన వల్ల కలిగే ప్రయోజనాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులు అవగాహనతో వ్యవహరించి పాటించాలని కోరారు.

మెదడుకు రక్షణ, భవిష్యత్తుకు భరోసా

ప్రజాశక్తి-నెల్లూరు: 'మెదడు స్ట్రోక్ అనేది తెలియకుండానే ఒక వ్యక్తిని కుంగదీసే ప్రమాదకరమైనదని, అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని ఒక్కసారిగా వికలాంగుడిగా మార్చగలదు. కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా కారణం కావచ్చు. అందుకే మెదడు ఆరోగ్యం పట్ల అవగాహన చాలా అవసరమని ప్రముఖన్యూరాలజిస్టు, మెడికవర్ వైద్యులు డాక్టరు దినేష్ గంగపట్నం అన్నారు. నేడు ప్రపంచ మెదడు దినోత్సవాన్ని, మెదడు ఆరోగ్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మెదడు సంబంధిత వ్యాధుల నివారణ చికిత్స గురించి ప్రజలకు తెలియజేయడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఒ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శరీరం మొత్తాన్ని నియంత్రించే మెదడని, ఆలోచనలు, భావాలు, కదలికలు, జ్ఞాపకశక్తి శరీర విధులను పర్యవేక్షిస్తుందన్నారు. అందుకే మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మెదడు స్ట్రోక్ లక్షణాలను ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ తమ మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి'' అని అన్నారు. ప్రస్తుత జీవనశైలిలో, ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవడం, పోషకాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అనేక కారణాలు మెదడు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీని ఫలితంగా స్ట్రోక్, అల్జీమర్స్, పార్కిన్సన్స్, డిమెన్షియా, బ్రెయిన్ ట్యూమర్‌లు వంటి న్యూరోలాజికల్ సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయసు నుంచే మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యమన్నారు. సమతుల్య ఆహారం: పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు మెదడు ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం: శారీరక శ్రమ మెదడుకు రక్త ప్రసరణను పెంచి, జ్ఞాపకశక్తిని, ఆలోచనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు.


డాక్టర్ దినేష్

కరేడులో సిపిఎం నేతలు అరెస్ట్

ప్రజాశక్తి-కందుకూరు

కరేడు ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న సిపిఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మెప్పుకోసం సోమవారం సాయంత్రం ఉలవపాడు పోలీసులు ఇలా చేశారు. కరేడులో జరుగుతోన్న ఉద్యమాన్ని నిరుగార్చడానికి ఓ వైపు ప్రజలకు, రైతులకు న్యాయం చేస్తానని, అండగా ఉంటానని చెబుతోన్న ఎంఎల్ఎ ఇంటూరి ఇంకో వైపు ఉద్యమాన్ని నీరుగార్చి , ప్రజలు, రైతుల మధ్య విభజన తీసుకురాడానికి పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఈ సందర్భంగా ఎంఎల్ఎ సోమవారం సాయంత్రం రామకృష్ణాపురం గ్రామానికి వెళ్లారు. ఈ సమయంలో అక్కడకు వెళుతోన్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ,సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివిబి కుమార్ ,సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తాము గ్రామానికి వెళతామని చెప్పగా మీపై కేసు లున్నాయని, అందుకే అరెస్ట్ చేస్తున్నామని చెప్పి అక్కడ నుంచి ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. గత నెల 29న జాతీయ రహదారి దిగ్బంధనం చేసిన కేసులో అరెస్ట్ చేస్తున్నట్లు పోలీసులు అంటున్నారు. ఉద్యమాన్ని బలహీన పర్చడానికి అధికారపార్టీ నేతల ఎత్తుగడలుగా స్థానికులంటున్నార

గిరిజనుల పేరుతో భారీ కుంభకోణం

-యాక్సిస్ బ్యాంకు వ్యవహారంపై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి - నెల్లూరు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

జిల్లాలోని కొన్ని ప్రాంతాలల్లోని గిరిజనులకు రుణాలు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపిస్తూ రూ. 20 కోట్లు మాయం చేసి కొందరు వ్యక్తులు ఘరానా మోసానికి పాల్పడ్డారని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు చేయించి, నిందితులను శిక్షించి గిరిజనులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులైన గిరిజనులకు మాయమాటలు చెప్పి వారి నుంచి ఆధార్ కార్డులు, సిమ్‌కార్డులు తీసుకొని, మూడు బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొని గిరిజనులను, బ్యాంకులను కొందరు మోసం చేశారన్నారు. ఈ వ్యవహారంపై బ్యాంకు అధికారులపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి బ్యాంకుల నుంచి రుణం తీసుకొని వారికి బ్యాంకు యాజమాన్యం మీరు రుణాలు తీసుకున్నారు.. తిరిగి చెల్లించాలని నోటీసులు పంపించడం దారుణం, దుర్మార్గమన్నారు.విడవలూరు గ్రామానికి చెందిన గిరిజన కాలనీకి రూ.15 లక్షలు, ముత్తుకూరు ప్రాంతంలో సుధాకర్ అనే వ్యక్తి కొంత మందికి బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామని అమాయక గిరిజనులను మోసం చేశారన్నారు. బ్యాంకు అధికారుల సహకారంతో గిరిజనులను మోసం చేశారన్నది అర్థమవుతుందన్నారు. ఈ స్కాంలో సుమారుగా రూ.20 కోట్ల వరకు మాయం అయినట్లు సమాచారం వస్తుందన్నారు. మూడు బోగస్ కంపెనీల పేరుతో ఈ కుంభకోణం జరిగిందన్నారు. జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఈ స్కాం వెనుక ఎవరెవరు బడాబాబులున్నారో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్నెల్ల కిందటే ఈ వ్యవహారంపై బ్యాంకు అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు. ఈ సమాచారం ఆనోటా.. ఈనోటా బహిరంగం కావడంతో అసలు వ్యవహారం బయట పడిందన్నారు. యాక్సిస్ బ్యాంకులో రుణాల పేరుతో భారీ స్థాయిలో చోటు చేసుకున్న కుంభకోణ వ్యవహారం 'కుబేరా' సినిమాను తలపించే విధంగా మాజీ డిప్యూటి మేయర్ మాదాల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి దోపిడీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రయివేట్ బ్యాంకులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోతే ఇటువంటి కుంభకోణాలు అనేకం వెలుగులోకి వస్తాయన్నారు. తక్షణమే సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుపేదలను రక్షించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు శ్రీవివేకా విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు



శ్రీ వివేక డిగ్రీ కళాశాల 34 (ఏ) బెటాలియన్ 187(బి) కాయ్ ఎన్‌డిఎ విభాగానికి చెందిన ముగ్గురు ఎన్‌సిసి క్యాడేట్స్ జి.థామస్,కె అఖిల్,కె వేణుగోపాల్ లు జాతీయస్థాయిలో ఈనెల 15నుంచి 24వ తేదీ వరకు సికింద్రాబాద్ లో నిర్వహించే ఆర్మీ క్యాంపునకు ఎంపికయ్యారు.ఈ శిబిరం భారత సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించబడుతుండగా దేశవ్యాప్తంగా ఎంపికైన ఎన్‌సిసి క్యాడేట్స్ ఇందులో భాగస్వామ్యం అవుతారు. ఈ శిక్షణ శిబిరంలో ఫిజికల్ ఫిట్నెస్,డ్రిల్ తదితర అంశాలపై క్యాడేట్ కు శిక్షణ ఇస్తారు. ఇది వారు డిఫెన్స్ లో చేరే దిశగా కీలక అనుభవంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్రబాబు లు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అబ్బూరివెంకటేశ్వర్లు, డి శ్రీనివాసరావు, ఎన్‌సిసి సిటిఓ వేణు గోపాలరెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

హైవే పక్కనే పక్కా గృహాలు ఏర్పాటు చేయిస్తా

..కరేడు ఉద్యమంలో "ఇంటూరు" చిచ్చు
..ఓవైపు మద్దతు..మరో వైపు కంపెనీకి వత్తాసు

ప్రజాశక్తి-ఉలవపాడు :
కరేడు ప్రజా ఉద్యమాన్ని స్థానిక ఎంఎల్ఎ ఇంటూరు నాగేశ్వరరావు బలహీన పరిచే చర్యలు చేపడుతున్నారు.. కరేడును కాపాడుతానని, రైతులకు, ప్రజలకు న్యాయ చేస్తానని, మీ పోరాటానికి మద్దతుగా ఉంటానని చెప్పుకుంటూ వచ్చిన ఆయన ఇప్పుడు రైతులు, ప్రజలను విభజించే పనిలో ఉన్నారు. కంపెనీకి భూములు ఇవ్వాలని, రైతుల పై వత్తిడి తీసుకొస్తుండగా, తాజాగా ఎన్నో ఏళ్లగా నివాసముంటున్న గిరిజనులు, దళితుల గ్రామాలను ఖాళీ చేయాలని ఉచిత సలహా ఇచ్చారు. సోమవారం ఎంఎల్ఎ భారీ పోలీసుల బందోబస్తు, మంది మార్బలంతో కరేడు పంచాయతీల్లోని రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాల్లో పర్యటించారు. అక్కడ సభలు ఏర్పాటు చేశారు. తమకు మద్దతు చెప్పడానికి ఎంఎల్ఎ వచ్చారని ఆశపడ్డ ప్రజలు ఎంఎల్ఎ మాటలతో విస్తుపోయారు. ఉద్యమంలో కీలకంగా ఉంటున్న మహిళలను, నాయకులను ఇళ్లలో నుంచి బయటకు రాకుండా పోలీసులు చూసుకున్నారు. ఈ ఉద్యమంలో తొలి నుంచి కీలకంగా ఉన్న సిపిఎం నాయకులు జి ,వెంకటేశ్వర్లు, కుమార్, గౌస్‌బాషాలను అరెస్ట్ చేయించి ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్థానిక ప్రజలో ఎంఎల్ఎ మాట్లాడుతూ కరేడు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు ఉపాధి ఉద్యోగ కల్పన కల్పిస్తామని పాతికేళ్లగా పాలకులు చెబుతోన్న మాటలనే వల్లివేశారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా పరిశ్రమల అవసరం ఎంతైనా ఉందని, ఈ పరిశ్రమల కల్పనలో కొద్దిపాటి ఇబ్బందులు తప్పవని ఒక చోటు నుండి మరోచోటికి వెళ్లడం అనివార్యమని చెప్పారు. . బిపిసిఎల్ ఇండో సోలార్ వంటి కంపెనీలు వచ్చినప్పుడు మన ప్రాంతం ఆర్థిక అభివృద్ధితో పాటు ఉపాధి జరుగుతుందని, వాటిని ఆలోచించి పరిగణనలోకి తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. పరిశ్రమలు ఏర్పడే క్రమంలో మీ భూములు పోతాయని, వాటికి ప్రత్యామ్నాయం చూపించి మీకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ జాతీయ రహదారి పక్కనే కాలనీ ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తిగా అయ్యేంతవరకు మీ భూములు ఇళ్లస్థలాలు ఖాళీ చేయించేది లేదని ఆయన సభలో తెలిపారు. 18 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరికీ ఒక ఐదు సెంట్లు భూమిని కల్పించి ఆర్థికంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ ప్రభుత్వం మాట చెప్తే కట్టుబడి ఉంటదని ఎలాంటి అపోహాలు చెందకుండా సహకరించాలనీ కోరారు. కంపెనీలకు వ్యతిరేకంగా తమకు మద్దతుగా ఎంఎల్ఎ వస్తున్నారని భావించిన స్థానికలు ఖంగుతిన్నారు. అనంతరం గ్రామస్తులతో సుపరిపాలనలో మొదటి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు,కరేడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము, కుసుమ కుమారి, కరేడు తెలుగుదేశం పార్టీ నాయకులు పొలుబోయిన శ్రీను,మాచిరాజు రాంబాబు, పిట్టా శ్రీనివాసులు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా "స్మార్ట్ స్ట్రీట్ బజార్" ప్రాజెక్టు

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

వీధి వ్యాపారుల ఆర్థిక అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న "స్మార్ట్ స్ట్రీట్ బజార్" ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్మోహన్ రావు, ఈ.ఈ రహంతు జానీ, డి.ఇ రఘురాం, పాల్గొన్నారు.



వేస్ట్ పిక్కర్ సామాజిక భద్రత పై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు మున్సిపాలిటీలో సోమవారం కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్,మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్మెంట్ ,మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నమస్తే కార్యక్రమంలో భాగంగా వేస్ట్ పిక్కర్ సామాజిక భద్రత పై అవగాహన జరిగింది.ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఐ.మారుతి ప్రసాద్ పర్యవేక్షణలో నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ సానిటేషన్ ఎకోసిస్టమ్ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఐ.మారుతి ప్రసాద్ మాట్లాడుతూ వ్యర్థాల సేకరణ అనేది ఎక్కువగా అనధికారిక రంగ కార్యకలాపమని,దాని వల్ల కార్మికులు తరచుగా స్వయం ఉపాధి పొందుతూ ఉంటారు. అందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ సచివాలయం సిబ్బంది సుమలత, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పరిహారం చెల్లిస్తాం

ప్రజాశక్తి-గుడ్లూరు

రామాయపట్నం ఓడరేవు అనుబంధ పరిశ్రమల కోసం ప్రభుత్వానికి భూములు ఇచ్చిన నిర్వాసితులకు త్వరలో పరిహారం చెల్లిస్తామని గుడ్లూరు తహశీల్దార్ విజయభాస్కర్ సోమవారం తెలిపారు. గుడ్లూరు రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గుడ్లూరు మండలం, చేవూరు, ఏలూరుపాడు గ్రామాలకు చెందిన 400 మంది రైతులు దగ్గర నుంచి అనుబంధ పరిశ్రమల కోసం 1100 ఎకరాలకు సంబంధించి ఎకరానికి 23 లక్షల రూపాయలు వంతున చెల్లించేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించారన్నారు. త్వరలోనే లబ్ధిదారులందరికీ పరిహారం చెల్లించడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఓడరేవు అనుబంధ పరిశ్రమల కోసం గత ప్రభుత్వ ఇండో సెల్ కంపెనీకి 3,500 ఎకరాలు కేటాయించిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు బిపిసిఎల్ కంపెనీకి రైతుల దగ్గర భూములు సేకరించి బదిలీ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. దీంతో లబ్ధిదారులందరికీ పరిహారం చెల్లిస్తామన్నారు.

చిరు వ్యాపారులకు షాపులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

వీధులలో చిరు వ్యాపారులైన విక్రయదారులకు, ప్రభుత్వం షాపులను మంజూరు చేయాలని, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, విక్రమ సింహపురి వీధి విక్రయిదారుల సంక్షేమ సేవా ట్రస్టు నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనందకు సోమవారం వినతి పత్రం అందజేశారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి


నెల్లూరులో నినాదాలు చేస్తున్న దృశ్యం


ఉలవపాడులో

ప్రజాశక్తి-నెల్లూరు: అంగన్‌వాడీలకు ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలు తిరిగి అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, యాప్‌లను రద్దు చేయాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఈ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తూ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని సిడిపిఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనా బేగం సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలోని గర్భిణులకు, బాలింతలకు ఆర్నెల్ల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలను నమోదు చేసి వారికి రికార్డు పరంగా టి హెచ్ ఆర్ ఇస్తూ వచ్చిన సరుకులు అన్ని లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యమూ, ఆటంకం లేకుండా టీచర్లు అందిస్తున్నారు. పిల్లల ప్రీస్కూల్ కూడా బాగా నిర్వహించేవారు. ప్రభుత్వం ఫోన్లు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం పెట్టిన పోషణ ట్రాకర్ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బాల సంజీవిని యాప్లు ఈ ఫోన్ లలో సక్రమంగా రాణి కారణంగా సరుకుల కోసం పదేపదే లబ్ధిదారులు వచ్చి యాప్స్ ద్వారా ఫోన్ క్యాప్చర్స్, ఈకేవైసీ, ఓటిపిలు రాణి కారణంగా రోజుల తరబడి మళ్లీ మళ్లీ సెంటర్లకు తిరిగిపోతున్నారు ఒక్కొక్కరికి నాలుగు ఐదు సార్లు తీయాలంటే ఈ ఫోన్లు ప్రభుత్వం మార్చి ట్యాబులు ఇవ్వాలి అని అన్నారు. ఈ పని ప్రభుత్వం చేయకుండా 100శాతం అంటూ లబ్ధిదారుల పేర్లను డిలీట్ చేసి 100శాతం చూపిపించుకుంటున్నారు. సూపర్వైజర్లు, అధికారులు ప్రభుత్వానికి వాస్తవాలు తెలియజేసి ఈ యాప్ లు వెంటనే రద్దు చేయాలన్నారు.గత ప్రభుత్వంలో దాదాపు 42 రోజులు సమ్మె చేసి మినిట్స్ కాపీ ఇచ్చారని ఆ మినిట్స్ కాపీలో ఉన్న హామీలను వెంటనే అమలు చేయాలని, జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రూరల్ నాయకులు పులిమి నరసింహారెడ్డి, శివాజీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు బి. రజిని, కామాక్షి, నాయకులు మల్లెమ్మ, కె. శాంతి, నాగభూషణమ్మ, మాధవి, రమాదేవి, సుమతి, ఉష, కల్పన పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు
అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఉలవపాడు సిడిపిఓ కార్యాలయం దగ్గర, ధర్నా జరిగింది. ఈ ధర్నాలో, సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, జి వి బి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ఎన్నికల ముందు అంగన్‌వాడీ సమస్య లు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి, 42 రోజుల సమ్మె శిబిరంలో వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోగా, వీరిపై పని భారం మోపి అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు.ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. వెంటనే అన్ని యాప్లు రద్దుచేసి ఒకే యాప్ కింద తీసుకురావాలని వాళ్ళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు సిడిపిఓ మాధవి లతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్లు, సిహెచ్ ఇందిరావతి, వాకాలతారెడ్డి, సిఐటియు గుడ్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు లు, ఎస్‌కె పద్మజ, కొట్టే వెంకయ్య, గుడ్లూరు సెక్టార్ లీడర్లు, కొమరగిరి సునీత, సిహెచ్ వరలక్ష్మి పద్రే తిరుపతమ్మ, కే రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు యత్నం

ప్రజాశక్తి-కందుకూరు: మాలకొండ పరిసర ప్రాంతాలలో నిక్షిప్తమై ఉన్న అపార ఖనిజ సంపదను జిందాల్ కంపెనీకి కట్టబెట్టాలని చూస్తున్న పరిస్థితులను తహశీల్దార్, కలెక్టర్‌లకు లేక పంపించిన అంశంపై శనివారం అమ్ ఆద్మీ పార్టీ కందుకూరు అసెంబ్లీ కన్వీనర్ నేతి మహేశ్వర రావు, కందుకూరు అభివృద్ధి మండలి ఉపాధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు ,సిపిఐ కందుకూరు కార్యదర్శి భూసి సురేష్ ఆయా ప్రాంతాలలో తిరిగి పరిశీలించి ఫోటోలు వీడియోలు సమాచారం సేకరించామని వివరించారు.ఈ సందర్భంగా అక్కడ గ్రామస్తులతో నేతి మహేశ్వర రావు, పాలేటి కోటేశ్వరరావు రైతులతో మాట్లాడారు. ఆ సందర్భంగా అక్కడ రైతులు చెప్పిన వివరాల ప్రకారం ఇది గత ప్రభుత్వం 2021లో ఇచ్చిన ప్రతిపాదనని ప్రస్తుత ప్రభుత్వం వేగంగా ముందుకు వెళ్తున్న పరిస్థితి అని రైతులు వివరించారని తెలిపారు. ఈ విషయంపై అమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో కందుకూరు పార్టీ ఆఫీసులో అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగి ంది. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్, సిపిఐ కార్యదర్శి బూసి సురేష్, బరేషన్ కాంగ్రెస్ నాయకులు బి. వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు.



మాట్లాడుతున్న ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి-కలిగిరి

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించి అరాచక పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తగిన బుద్ధి చెప్పాలని నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని కలిగిరిలో ఆవుల కల్యాణ మండపంలో జరుగు బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భయపడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదురు నిలబడి ముఖ్యమంత్రిగా జగనన్నని చేసేంతవరకు పోరాడుదామని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నమ్మిన ప్రతిసారి ప్రజలని వంచించడం ముఖ్యమంత్రి అయ్యక హామీలు గాలికి వదిలేయడం చంద్రబాబుకు అలవాటే అని విమర్శించారు. ఎవ్వరూ అధైర్య పడవద్దని అండగా తానుంటానని భరోసానిచ్చారు. త్వరలో గ్రామగ్రామాన పర్యటించి బాబు మోసాలను ప్రజలకి వివరించి రానున్న ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుని సుఖసంతోషాలతో గడపడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమం పోస్టర్‌ను నాయకులు కార్యకర్తలతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీందర్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ ఆలీ అహ్మద్, మండలాల ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.



కార్యకర్తల జోలికొస్తే ఉపేక్షించం..

ప్రజాశక్తి-దగదర్తి : అధికారాన్ని అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు, బెదిరింపులతో వైసిపి కార్యకర్తలను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని కావలి మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు అండగా నిలబడుతానని స్పష్టం చేశారు. దగదర్తిలో సోమవారం నిర్వహించిన 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' విస్తృత స్థాయి సమావేశానికి రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగదర్తి మండలంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. త్వరలో దగదర్తి మండల కమిటీలను నియమిస్తామని తెలిపారు. అనంతరం కార్యకర్తల కష్టసుఖాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెలినేని మహేష్ నాయుడు, చింతలబోయిన వెంకటేశ్వర్లు, గోగుల వెంకయ్య, అనిల్ రెడ్డి, వివేక్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి, వట్టికాల మాధవ రావు, అల్లం రమణయ్య, అల్లం వెంకయ్య, మంద అశోక్, దగదర్తి శేఖర్‌నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-కొడవలూరు : ప్రజల్లో ఒకరిగా ఉంటూ.. సేవ చేయడమే తన జీవిత లక్ష్యం అని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఆమె సోమవారం మండలంలోని రామన్నపాలెం, ఆలూరుపాడు గ్రామపంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు, అబ్దుల్ అజీజ్, మండల ఇన్‌ఛార్జి మంగమూరు శ్రీహరి రెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజర్ జి వి ఎన్ శేఖర్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు నాప వెంకటేశ్వర్ నాయుడు, అమరేందర్‌రెడ్డి, రాజా, శివకుమార్, కాకి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు కొండత అండ..

ప్రజాశక్తి-కోవూరు : సింహపురి వైద్యసేవా సమితి ద్వారా అన్ని రకాల సేవలను అందించి నందువల్ల గిరిజన కుటుంబాలకు కొంత ఊరట లభించిందని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం పడుగుపాడు చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీలో గిరిజనులుకు ఉచిత ఆరోగ్య కార్డులను ఆమె చేతుల మీదుగా అందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండతో గిరిజనులకు సింహపురి సేవా సమితి ద్వారా 10పడకల ఆసుపత్రిని, గర్భిణులకు ఉచిత వైద్యం ఎంతో ఉపాయేగకరమని రాష్ట్ర టిడిపి సీనియర్ నేత, వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కార్యక్రమంలో సింహపురి సేవా సమితి సభ్యులు, జి ఎం గురుప్రసాద్, సిబ్బంది, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, మండలం అధ్యక్షులు కొల్లా సుధాకర్ రెడ్డి, జెట్టి మదన్ రెడ్డి, దారపునేని శ్రీనివాసులునాయుడు, శ్రీనివాసులు, పెంచలయ్య, గుత్తికొండ వెంకయ్య, సుబ్బా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-వరికుంటపాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, మహిళాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాంచెరువు, తూర్పు బోయమడగం, గ్రామాల్లో ఎంఎల్ఎ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చండ్ర మధుసూదన్ రావు, మాజీ మండల కన్వీనర్ చండ్ర వెంకయ్య, సీనియర్ నాయకులు ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వైస్ ఎంపిపి మధు, క్లస్టర్ ఇంచార్జ్ పోక మహేష్, కో కన్వీనర్ పేరం సుధాకర్ రెడ్డి, అంద్రా బాల గురువారెడ్డి, ఆవుల అరుణమ్మ, కామేపల్లి వెంకటరత్నం, పోల మాధవరావు, గోడుగునూరి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో ఆర్థిక అవసరాల నిమిత్తం జరిపే లావాదేవీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సిఐ గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విలువైన ఆస్తుల కొనుగోలు అమ్మకాలలో ఇతర వ్యాపార లావాదేవీల సమయంలో నగదు బదలాయింపులో అతి జాగ్రత్తగా ఉండాలని సిఐ అన్నారు. జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు నేపథ్యంలో ప్రజలు ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలా జాగ్రత్త వహించాలని సూచించారు.

విభేదాలు వీడి అభివృద్ధికి పాటుపడాలి



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : నాయకులంతా ఒకటిగా ఉండి తమ గ్రామాలలో అభివృద్ధికి పాటుపడాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని పెనుబల్లి, మినగల్లు గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో సోమవారం ఆమె పాల్గొన్నారు. పెనుబల్లి గ్రామంలో రూ.29 లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రతి ఇంటికి తిరిగి గడిచిన సంవత్సరంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పెనుబల్లి గ్రామ సర్పంచ్ ఓడా పెంచలయ్య, మాజీ ఎంపిటిసి వినయ్ నారాయణ, మినగల్లు గ్రామ సర్పంచ్ పొర్ల పూజిత, రాము, కే సురేష్ రెడ్డి, బత్తల హరికృష్ణ, ఫుడ్ సుబ్రహ్మణ్యం నాయుడు, నరసింహులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న పారా అథ్లెటిక్స్ ఎంపికలు

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జులై 30న జరిగే జూనియర్స్, సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025 క్రీడ ఎంపికలో పాల్గొని సత్తాచాటాలని జిల్లా పారా క్రీడ కమిటీ అధ్యక్షులు టిసి మల్యాద్రి నాయుడు కోరారు. ఆయన సోమవారం కావలి పట్టణంలో ఉన్న దివ్యాంగులకు భవిత పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో ఉన్న ప్రతి దివ్యాంగ క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భవిత పాఠశాల టీచర్ పాల్గొన్నారు.

ప్రతిఇల్లూ సంతోషంగా ఉంది..

ప్రజాశక్తి-దుత్తలూరు : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందని, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి నెలకొందని టిడిపి సీనియర్ నాయకుడు మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో సోమవారం ఎస్.నాగాయపాలెం పంచాయతీ ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేయబోయే పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, టిడిపి సీనియర్ నాయకులు చిలకా జయరామ్, రవీ, శివకుమార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఓ నిరుపేద ధీనగాథ..!

నెల్లూరు యాక్సిస్ బ్యాంక్‌లో కుబేరా టీమ్ చేసిన అరాచకాలు ఒకటి.. రెండు.. కాదు వందల్లో కనిపిస్తున్నాయి. 2020 నుంచే ఈ బ్యాచ్ ఈ వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. బాధితులు ఒక్కొక్కరు బయటకొస్తున్నారు. నెల్లూరు జిల్లాలోనే కాకుండా చెన్నయ్, విజయవాడ, కాకినాడ, జగ్గయ్యపేట, విశాఖపట్నం ప్రాంతాలకు విస్తరించినట్లు సమాచారం. పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఫేక్ కంపెనీలు పెట్టి మోసం చేసిన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. బ్యాంక్ అధికారుల నుంచి మరింత రికార్డులు సిద్ధం చేస్తున్నారు. కూలీలు, పశువుల కాపరులే కాదు. సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు, ఇంటింటి పాచిపని చేసుకునే మహిళలను ఈ బ్యాచ్ వదల్లేదు. ఉన్న ఊర్లో బతకలేక.. పొట్టచేత పట్టుకొని నెల్లూరు వచ్చిన ఓ నిరుపేద కుటుంబాన్ని నిలువునా ముంచేశారు. ఆ మహిళను స్టాఫ్‌వేర్ ఉద్యోగిగా సృష్టించారు. ఆమె పేరుపై నాలుగుచోట్ల రూ.1.45 కోట్లు రుణం తీసుకున్నారని ఉంది. ఇప్పుడు బ్యాంక్ అధికారులు బకాయిలు చెల్లించాలని బెదిరింపులకు దిగడంతో వడ్డీకి అప్పులు చేసి చెల్లిస్తున్నారు. భర్త వదిలేసి, ఇద్దరు బిడ్డలతో పాచిపని చేసుకొని జీవిస్తున్న ఆ మహిళ కన్నీరు మున్నీరవుతోంది...

- ఇంటింటి పాచిపని చేసుకునే మహిళను వదల్లేదు..
- కుబేర బ్యాచ్ నమ్మించి మోసం
- రూ.1.45 కోట్లు యాక్సిస్ బ్యాంక్‌లో రుణం
- భర్త వదిలేసి వెళ్లిపోయాడు
- బ్యాంకర్ల బెదిరింపులతో అప్పులు చేసి చెల్లింపులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు యాక్సిస్ బ్యాంకులో కుబేర బ్యాచ్ చేసిన అక్రమాలు, అవినీతి, బయటకొస్తుంటే బాధితులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఇది ఇప్పటిది కాదు.. 2020 నాటి నుంచే ఈ బ్యాచ్ ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రూ.20 కోట్లు చెబుతుండగా పరిస్థితి చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్లు మింగేశారు. "ప్రజాశక్తి" ఈ వ్యవహారాన్ని బయటకు తీసుకురావడంతో పోలీసులు, మీడియా స్పీడ్ అయింది. ఇప్పుడు బాధితులు వరుస కడుతున్నారు. ఒక్కొక్కరి దీనగాథ వింటే మాటలు రావడం లేదు. ఓ నిరుపేద మహిళ పరిస్థితి ప్రతి ఒక్కరీ హృదయాలను కదిలిస్తోంది. ఒంగోలు దళితవాడకు చెందిన మోక తనుజా కాకినాడ వీరవనం గ్రామానికి చెందిన మోజీస్‌తో ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు జన్మించారు. ఉన్న ఊర్లో జీవించలేక 2021లో నెల్లూరుకు వలసవచ్చారు. నగరంలోని వనంతోపు సెంటర్‌లో అద్దె ఇంట్లో నివాసముండగా ఆ సమయంలో అక్కడ జాలె వాసుదేవనాయుడు సెక్యూరిటీ ఏజెన్సీ నడుపుతున్నారు. మోజీస్‌కు సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పించారు. ఈ పరిచయంతో తనూజకు ఓ టీషాపులో పని ఇప్పించారు. కుటుంబ పరిస్థితులు బాగా లేకపోవడంతో వాసుదేవనాయుడు అప్పు ఇవ్వాలని కోరినట్లు తెలిపింది. బ్యాంక్ నుంచి అప్పు ఇప్పిస్తానని ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్, తీసుకున్నారు. రూ.2లక్షలు ఆఫీసుకు పిలిచి ఇచ్చారు. తనూజ పనస్తుండే, తనజీతం, భర్త జీతంతోపాటు ఒంగోలు ఇంటి నుంచి తన తల్లిదండ్రులు కూలీ పనులు చేసి పంపించే నగదుతో ప్రతినెలా రూ.20వేలు చొప్పున మొత్తం చెల్లించింది. భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మళ్లీ తనకు రూ.3 లక్షలు అవసరం ఉందని చెప్పడంతో బ్యాంక్ రుణమని చెప్పి ఇచ్చారు. ప్రతినెలా రూ.25వేల చొప్పున ఆ మొత్తం చెల్లించారు. అక్కడక్కడా భార్యభర్తలు ఇద్దరు కలిసి పనిచేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవిస్తున్నారు.

తనూజ పేరుతో రూ.1.45 కోట్ల దోపిడీ..!


కాకినాడకు చెందిన తనూజ తన ఇద్దరి బిడ్డలను చదివించుకుంటూ నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో ఉంటున్నారు. ఇటీవల కాలంలో బ్యాంక్ నుంచి ఆమెకు తరచూ ఫోన్లు రావడంతో ఖంగు తినింది. నగరంలోని ఆర్‌టిసి యాక్సిస్ బ్యాంక్ అధికారులు నుంచి ఫోన్ రావడంతో బ్యాంక్‌కు వెళ్లింది. మీరు స్టాఫ్‌వేర్ ఉద్యోగినే కదా మీ పేరు మీద మా బ్యాంక్‌లో రూ.35లక్షలు రుణం తీసుకున్నారని బాంబు పేల్చారు. తనకు ఏమీ తెలియదని, తాను అక్కడక్కడా పాచిపని చేసుకుంటానని, వాసుదేవ నాయుడు నాకు డబ్బులిస్తే తిరిగి ఇచ్చేనని చెప్పినా బ్యాంక్ అధికారులు ఒప్పుకోలేదు. మీరే చెల్లించాలంటూ బెదిరింపులకు దిగారు. ఇంటికొచ్చిన ఆమెకు చెన్నయ్ యాక్సిస్ బ్యాంక్ నుంచి మరో ఫోన్ వచ్చింది. మీ పేరుపై మా బ్యాంక్‌లో రూ.65 లక్షలు రుణం తీసుకున్నారని, ఎప్పుడు చెల్లిస్తారని ఆరా తీశారు. జగ్గయ్యపేట బ్యాంక్ నుంచి మరో రూ.45 లక్షలు బకాయి ఉన్నట్లు అధికారులు ఫోన్ చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబం నివ్వెరపోయింది. తనకు తెలియకుండా ఇంత డబ్బులు ఏం చేశావంటూ భర్త మోజీస్ భార్య తనూజతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బ్యాంక్ అధికారులు నిత్యం ఫోన్ చేస్తూ నగదు చెల్లించాలని బెదిరింపులకు దిగుతున్నారు. రెండు ఇళ్లలో పాచిపని చేసుకుంటూ నెలకి రూ.3500 సంపాదిస్తున్న, తల్లిదండ్రులు పంపుతోన్న డబ్బుతో పిల్లలను చదివించుకుంటుంది. బ్యాంక్ అధికారులు ఒత్తిడి ఎక్కువ కావడంతో ఆత్మహత్యే శరణ్యమని బోరున విలపిస్తోంది..



కన్నీరు మున్నీరు అవుతోన్న బాధితురాలు తనూజ

తనూజ కన్నీరు మున్నీరు...!

కుబేరా బ్యాచ్ చేసిన మోసానికి తన కుటుంబం చిన్నాభిన్నమైపోయిందని, భర్త వదిలేసి వెళ్లిపోయారని, తనకు ఏం చేయాలో అర్థం కావడం లేదంటూ తనూజ కన్నీరు మున్నీరయ్యింది. తన పేరుపై చెన్నయ్, జగ్గయ్యపేట, నెల్లూరు యాక్సిస్ బ్యాంక్‌లో జాలె వాసుదేవనాయుడు రూ.1.45 కోట్లు రుణం తీసుకున్నారని, తనను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చిత్రీకరించారని "ప్రజాశక్తి"కి తెలిపారు. తనకు బ్యాంక్ ఎక్కడుందో తెలియదని, తమ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశారని వాపోయింది. తనలాగే అనేక మంది ఇలాంటి ఉచ్చులో ఉన్నారని, ఇటీవల బ్యాంక్ అధికారులు బెదిరించడంతో వడ్డీకి అప్పు తీసుకొని రూ.18 వేలు చెల్లించానని తెలిపారు. రుణం కట్టకపోతే కాకినాడలోని మీ ఆస్తులు వేలం వేస్తామని, జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారన్నారు. తన ఇద్దరు బిడ్డలతో చనిపోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని ఆమె బోరున విలపించారు. కుబేర బ్యాచ్ అక్రమాలకు బలైపోయిన బాధితులు ఒక్కొక్కరు బయటకొస్తున్నారు. తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలని అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తే వాస్తవాలు బయటకొచ్చే అవకాశం ఉంది.



బాధితురాలి పొలంను పరిశీలిస్తున్న నాయకులు

పోరంబోకు భూమిలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : ఏపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు చేజర్ల మండలం మడపల్లి గ్రామంలో దళిత మహిళ వసంతమ్మ సాగు చేసుకుంటున్న ఏటి పోరంబోకు భూమిని పరిశీలించారు. అనంతరం చేజర్ల తహశీల్దార్ వద్దకు బాధితురాలను తీసుకెళ్లి కలిసి ఆమెకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ మడపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ వసంతమ్మ ఒంటరి మహిళ ఆమె భర్త చనిపోయాక, విధవరాలు ఇద్దరు బిడ్డలను పోషించుకుంటూ కూలిచేసుకుని జీవిస్తుందని, ఆమె గత 15యేళ్ల నుండి గ్రామంలోని ఏటి పోరం బోకు భూమిని చెట్టుపుట్ట కొట్టి చదును చేసుకొని పంట పండించుకొని జీవిస్తుందని, ప్రస్తుతం ఆ భూమి ని ఆ గ్రామానికి చెందిన చలమల సుబ్బారెడ్డి తన పట్టా పొలం పక్కన ఉందన్నారు. ఆ పోరంబోకు భూమి కాబట్టి అది నాది నీకు ఏమి సంబంధం లేదని చెప్పి ఆ భూమిలో అక్రమంగా ట్రాక్టర్ పెట్టి పనిపాట్లను కూడా ధ్వంసం చేశారని, ఇదిఏలా బాధాకరమన్నారు. ఆమెపైన రాజకీయ కక్షగట్టి అధికార పార్టీ అండతో అధికారులపై ఒత్తిడి తెస్తు కోరింట కేసులు కూడా కట్ చేయడం దుర్మార్గమన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన చలమల సుబ్బారెడ్డి నాట్లు వేసిన వరి పంటను ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదని వాస్తవంగా ఆమె భూమి పక్కన ఉన్న పట్టా భూమి ఆయనది కాదని ఎవరో కడప జిల్లా వాళ్లు కొన్నారని, ఆ భూమిని ఆయన కౌలుకు చేసుకుంటున్నాడని, ఆయనకు 50 ఎకరాలు పైన సొంత భూమి ఉన్నదని, రెండు ట్రాక్టర్లు ఉన్నాయని, ఆయన ధనికి రైతు అని, ఆయన పొలానికి అడ్డం పోరంబోకు భూమి ఉన్నదని పేదరాలైన వసంతమ్మ భూమ్మీద కన్ను వేసి ఈ భూమిని కూడా ఆక్రమించుకోవాలని చూడడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులు విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి విచారణ చేసి వసంతమ్మకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సం. జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, కౌలు రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, బాధితురాలు లింగంగుంట వసంతమ్మ, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పేదలకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామంలో సర్వేనెంబర్ 3లో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, భూకబ్జాదారుడు రాచమల్లు రమేష్‌ను వెంటనే ఖాళీ చేయించాలని సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడు గ్రామం సర్వేనెంబర్ 3లో 110 ఎకరాలను గత 35 యేళ్లుగా సాగు చేసుకుంటున్న 28మంది పేదలకు పట్టాలు ఇవ్వాలని, ఎలాంటి హక్కులు లేకుండా గ్రామంలోకి పోయే దారితో సహ 30 ఎకరాలను ఆక్రమించి టెంకాయ మొక్కలను నాటుతున్న భూకబ్జాదారుడైన రాచమల్లు రమేష్‌ను ఖాళీ చేయించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ గ్రామంలో 145 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికీ ఎవ్వరినీ లెక్క చేయకుండా 30 ఎకరాలలో టెంకాయ మొక్కలు నాటుతున్నప్పటికీ అతనిపై ఎలాంటి చర్య లేకపోవడం విడ్డూరంగా ఉందని ఇప్పటికైనా రెవెన్యూ పోలీస్ యంత్రాంగం స్పందించి ఇతనిని వెంటనే ఖాళీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గుడి రవీంద్ర, శ్రీపతి దయాకర్, గ్రామస్తులు ఎన్వి రమణయ్య, పొట్టేళ్ల దయాకర్, పెంచలయ్య, కవిలి సురేష్, ఎస్ కే మా భాషా, ఆధిప రెడ్డి, దాసరి సుమన్, గుంజి వెంకటరాయలు, దాసరి కృష్ణవేణి, కడింపాటి హరి, జయ లక్ష్మమ్మ, దువ్వూరు బుజ్జమ్మ, కత్తి జయమ్మ, పలిగల శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాగు ఆక్రమణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట నుంచి నెల్లూరుకు పోయే దారిలోని నక్కల వాగు సమీపంలో వాగుకు అనుకొని ఉన్న పట్టాదారు భూస్వాములు అక్కడ ఉన్న ఎత్తైన తాటి చెట్లను, ముళ్ళ కంపలను తొలగించి అక్కడ జెసిబి సహాయంతో వాగును కొంత భాగాన్ని రాత్రికి రాత్రి మట్టి వేసి చదును చేసుకున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారి ఇరిగేషన్ జెఇని ఫోన్‌లో సంప్రదించగా సోమవారం నక్కల వాగు దగ్గర ఆక్రమిత ప్రదేశాన్ని గమనించి, ఇదే విషయాన్ని తహశీల్దారుకు విన్నవించారు. వెంటనే తహశీల్దారు కే అనిల్ కుమార్ స్పందించి ఎఎస్‌పేట విఆర్ఒను ఆ ప్రాంతానికి వెళ్లి రిపోర్ట్ తీసుకొని రమ్మని తెలియజేశారు. అనంతరం తహశీల్దారు మాట్లాడుతూ మట్టిని వాగు ప్రాంతంలో చదును చేయడం జరిగిందని, ఆ రైతు వర్షాకాలంలో తమ పంట మునిగిపోయే అవకాశం ఉందని అందువల్ల ఎత్తుగా మట్టి వేయడం జరిగిందని తెలిపారని తహశీల్దారు అన్నారు. అనంతరం ఇరిగేషన్ జెఇ మాట్లాడుతూ వాగును ఆక్రమించుకునే ప్రక్రియను నిలుపుదల చేశామని ఆ రైతును మందలించామని తెలియజేశారు.

అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్


అంగన్‌వాడీ వర్కర్లలకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ లకు వివిధ రకాల యాప్‌లు పెట్టి పనిభారం పెంచి రోజుకు 15గంటల పనిని చేపిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు కూడా ఫేస్ క్యాప్చర్ ద్వారా సరుకులు ఇవ్వాలని చెప్పటం వల్ల అంగన్‌వాడీ వర్కర్స్‌కు ప్రభుత్వం 2జి సెల్ ఫోన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ యాప్ వల్ల ప్రీ స్కూల్‌ను నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. కావున ప్రభుత్వం అంగన్‌వాడీలకు 5జి ట్యాబ్‌లు ఇవ్వాలని, అంగన్‌వాడీలకు యాప్‌ల వల్ల కలిగే పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కె.రమణమ్మ, సుప్రజ, హమీద, సునీత, విజయమ్మ, మస్తానమ్మ, వాణి, వేణు కుమారి, లక్ష్మీనారాయణమ్మ, పద్మావతి, లబ్ధిదారులున్నారు.



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : అంగన్‌వాడీ వర్కర్ల యాప్‌లు రద్దు చేసి పనిభారం తగ్గించాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఇందుకూరుపేట ప్రాజెక్ట్ సిడిపిఒ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఎస్‌కె మస్తానమ్మతో కలిసి టి.పి.గూడూరు సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఇందుకూరుపేట ప్రాజెక్ట్ నాయకులు దుంపల సుగుణమ్మ, ఆర్ అనిత, డి.సుజన, ఏ.విమల, మహేశ్వరీ, ఎం.సుజన, ఎం.పావని, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : పేద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారం ఆరోగ్యం, విద్య అందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఐసిడిఎస్ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు విరుద్ధంగా మారుతున్నాయని జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వై.సుజాతమ్మ పేర్కొన్నారు. కోవూరులోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచాలంటూ ఫేస్ యాప్ రద్దు చేయాలంటూ ధర్నా చేపట్టారు. అనంతరం సిడిపిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు వై.సుభాషిణి ఎల్వీ శేషమ్మ, రాజ్యలక్ష్మి సునీత, కె.విజయమ్మ, తదితరులున్నారు.





ప్రజాశక్తి-అనంతసాగరం : అంగన్‌వాడీ వర్కర్ల యాప్‌లు రద్దు చేసి పనిభారం తగ్గించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా ఆధ్వర్యంలో అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ నాయకులు సునీత, లక్ష్మీ, నాగమణి, వసుంధర, జ్యోతి, అరుణ, ఆదిలక్ష్మీ, నూర్జహాన్, పద్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-కావలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన అనుభవంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారని వివరించారు. సోమవారం చలంచర్ల పంచాయతీలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా చలంచర్ల పంచాయతీలో రూ.6కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల వెంకటరావు, రాం ప్రసాద్, ఛాగంటి వెంకటేశ్వర్లు, గుర్రం సునీల్, బూత్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న ఎంపి, ఎంఎల్ఎ



కొనసాగుతున్న కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-కావలి : మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కావలిలో ఐదోరోజు సోమవారం కొనసాగింది. శిబిరం వద్ద కార్మికులను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సిఐటియు నాయకులు ఎం.పోలయ్య, ఎస్.కె. షాన్ వాజ్, యూనియన్ నాయకులు తురక సీనయ్య, బీ.మహేష్ ఒంగోలు రమేష్, జి.సీనయ్య జె.బాబు, క్రాంతికుమార్, మహిళా నాయకులు పి.చిన్నమ్మ, పి.అనిత, అప్పాటి జ్యోతి, నారాయణమ్మ, అలేఖ్య, శైలమ్మ, తిరుపతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి-కావలి : పేదలను పీడిస్తున్న బెల్ట్ షాపులను ఎత్తివేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బెల్టుషాపుల ఎత్తివేయాలని నిరసన తెలిపి, ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణకు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల సత్యవతమ్మ, కొండమ్మ, లక్ష్మినర్సు, నిరసన తెలిపారు. ఆర్‌డిఒ తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్ - స్కూటీ ఢీ

- ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి - ఉదయగిరి

బైక్ - స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. కరెంట్ ఆఫీస్ సమీపంలోని మొదటి బ్రిడ్జీ హైవేపై ఎదురెదురుగా వస్తున్న మోటార్ బైకు - స్కూటీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కనిగిరి నుండి మోటార్ బైకుపై ఉదయగిరికి వస్తున్న విజయ్, ఉదయగిరి నుండి స్కూటీపై దుత్తలూరు వెళ్తున్న దుగ్గినబోయిన వెంకటేశ్వర్లు ఎదురెదురుగా ఢీకొనడంతో విజయ్ కాలుకి గాయాలు కాగా పామూరుకు, వెంకటేశ్వర్లకు ముక్కు భాగం తీవ్ర రక్తస్రావం కావడంతో ఆత్మకూరుకు తరలించారు.

ఉపాధ్యాయుడికి అరుదైన పురస్కారం

ప్రజాశక్తి-మర్రిపాడు : ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులకు చక్కని విద్యను అందిస్తూ, దారాలతో పలురకాల చిత్రాలను తయారు చేసి రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ చేతుల మీదుగా మండల వాసి శివశంకర్ మాస్టర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. తాళపత్ర గ్రంధాల పరిష్కారం, అనేక గ్రంథాలు రాయడంతో ఈ అవార్డు ఆయనకి దక్కింది. తోటి ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

నేత్రదానం



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం వైకుంఠపురంకి చెందిన మెతుకు అలకనందా (59) ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు వారి స్వగృహంలో మృతి చెందారు. ఆమె నేత్రాలను కావలి రెడ్‌క్రాస్ సభ్యుడు ఎ.జె.మల్లేశ్వరరావు ప్రేరణతో ఆమెభర్త మెతుకు కోటయ్య నేత్రదానానికి అంగీకరించారు. కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం పర్యవేక్షకురాలు ఇలింద్ర శ్రీవాణి అలకానంద నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆమె కార్నియాలను ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 138వ నేత్రదానమని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి. రవి ప్రకాష్ తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

ఎ.ఐ.ఐ.ఇ.ఎ. 75వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం ఐ.సి.ఇ.యు. కావలి ఆధ్వర్యంలో ఆశానికేతన్ (తాళ్లపాలెం) కేంద్రానికి నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఎల్ఐసి కావలి మేనేజర్ ఎ.బాలాజీబాబు, ఐ.సి.ఇ.యు. అధ్యక్ష కార్యదర్శులు సి.హెచ్. ఫనీంద్ర కుమార్, బి సాయినాథ్ సింగ్, ఆశానికేతన్ సభ్యులు జషింత, పి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : జొన్నవాడ గ్రామంలో పినాకిని నదితీరాన కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి సోమిరెడ్డి శృతిరెడ్డి సారె సమర్పించారు. శ్రీ భ్రమరాంబిక సేవా సమితి నెల్లూరు సేవా బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ మాస సారెను సోమిరెడ్డి శృతిరెడ్డి సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆర్వ భూమి శ్రీనివాసులు రెడ్డి ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి వేద పండితులతో పూజలు చేయించారు.